క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి రూ. 51వేలు విరాళం


దాతలకు రశీదు అందిస్తున్న ఆలయాధికారులు

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వై.నవీన్, నాగిని దంపతులు రూ. 51 వేలు విరాళం అందించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులును కలిసి నగదు అందజేశారు. దాతలకు మహానందీశ్వరస్వామి వారి ప్రసాదాలు అందించి సత్కరించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్, శ్రావణి దంపతులు కామేశ్వరీదేవి అమ్మవారికి ఐదు గ్రాముల బంగారు తాళిబొట్టును అందించినట్లు ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి తెలిపారు.

నేలకొరిగిన వరి



పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో వరి పైరు నేలకొరిగింది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా ఏపుగా పెరిగిన వరి పైరు నేలకొరగడంతో రైతులకు నష్టం వాటిల్లింది. తీవ్ర నష్టం వాటిల్లిందని రైతు విశ్వనాథం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

అనధికారికంగా బంకుల ఏర్పాటు


ఎస్‌బీఐ సమీపంలో వెలుస్తున్న బంకులు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో రోడ్లకు ఇరువైపులా అక్రమంగా బంకులు వెలుస్తున్నాయి. ఇప్పటికే ప్రధాన రహదారులకు ఇరువైపులా అనధికారికంగా బంకులు వెలియడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వాటిని తొలగించడానికి అధికారులు ప్రణాళిక చేస్తుండగా, నూతనంగా రోడ్లకు ఇరువైపులా కొందరు నాయకుల ప్రోద్బలంతో బంకులను ఏర్పాటు చేసుకుంటున్నారు. గాయత్రీమాత దేవాలయం మొదలుకుని ఐటీఐ వరకు, రింగ్‌పార్క్ నుంచి బస్టాండ్, అంబేడ్కర్ సెంటర్ వరకు బంకులు ఏర్పాటుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తాటిపాడులో ఉపాధి పనులు కల్పించాలి

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో ఉపాధిపనులు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో 552 జాబ్‌కార్డులు ఉండగా 1,100 మంది వ్యవసాయ కూలీలు ఉన్నారు. ఈ మేరకు 490 జాబ్ కార్డులకు చెందిన 910మంది వ్యవసాయ కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటుంటారు. అయితే 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి నెలాఖరు వరకు గ్రామానికి 15,456 పనిదినాలు కేటాయించారు ఉన్నతాధికారులు. ఇప్పటిదాకా కేవలం 4,692 పనిదినాలు మాత్రమే ఉపాధి కూలీలకు పనులు కల్పించారు. అంటే కేవలం 30శాతం మేర మాత్రమే పనిదినాలు ముగిశాయి. ఉపాధి పనులు కల్పించాలని గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు కోరుతున్నా సంబంధిత అధికారులు పనులు కల్పించటంలేదనే విమర్శలు కూలీల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి పనుల కల్పన విషయంలో జూపాడుబంగ్లా మండలం వెనుకబడి ఉందని సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను పలుమార్లు ఆదేశించినా స్పందన కరువైందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే కొందరు ప్రజాప్రతినిధులు గ్రామంలో పనులు కల్పించవద్దని రాజకీయం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి పనులు కల్పించాలని కోరుతున్నారు గ్రామస్తులు.

18న సర్వసభ్య సమావేశం

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 18న మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. అన్ని శాఖల మండల అధికారులు ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలని వివరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఒంగోలుకు చెందిన చిలకపాటి వెంకట రంగారావుతో శ్రీశైల వైభవంపై ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ నిత్య కళారాధనలో ప్రతి రోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, సంగీత వాయిద్యం, భక్తి గీతాలు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

ముగిసిన బైబిల్ తరగతులు

శ్రీశైలంప్రాజెక్ట్: బెతెస్థా ప్రార్థనా మందిరంలో క్రైస్తవ చిన్నారులతో బైబిల్ విరామ పాఠశాలను 10 రోజుల పాటు నిర్వహించారు. ఏసుక్రీస్తు జీవిత చరిత్ర, బైబిల్‌లో ఉన్న అంశాలు, క్రైస్తవ గీతాలను చిన్నారులకు బోధించారు. పాఠశాలలో తరగతులు ముగియడంతో ఆదివారం చిన్నారులు కిరీటాలను ధరించి గ్రామ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.


శమీ వృక్షం వద్దకు శ్రీ దేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను తీసుకెళ్తున్న భక్తులు


ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


వెలుగోడులో అమ్మవారి గ్రామోత్సవంలో భక్తులు

దసరా సంబరాలు


వెలుగోడు: వేల్పనూరులో శమీ చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు


ప్రత్యేకంగా అలంకరణలో అమ్మవారి ప్రతిమ


బండిఆత్మకూరు: ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు


వెలుగోడు: వేలంపాటలో లడ్డూను దక్కించుకున్న సత్యనారాయణ


వెలుగోడు: విజయలక్ష్మిగా అమ్మవారి దర్శనం

బండిఆత్మకూరు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శ్రీశైలం నియోజకవర్గ వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 9 రోజుల పాటు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం బండిఆత్మకూరు మండలంలోని గంగా ఉమా సమేత ఓంకారేశ్వరాలయంలో అభిషేకం, నిత్యార్చన, విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు నిజరూప ఉమామహేశ్వరీదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం శమీ పూజ, సింహ వాహనం సేవతో ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి నాగ ప్రసాద్, దేవస్థానం మాజీ చైర్మన్ విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

● **జయలక్ష్మిగా అమ్మవారి దర్శనం**

ఆత్మకూరు: పట్టణంలోని చౌడేశ్వరిదేవి ఆలయం, పార్వతీమాత ఆలయంలో అమ్మవారు విజయలక్ష్మిగా పూజలందుకున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కుంకుమార్చన, యాగాలు, శమీ పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి మెయిన్ బజారు, తోటగేరి మీదుగా గ్రామోత్సవం సాగింది. ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

వెలుగోడు: మండల ప్రజలు విజయదశమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి గ్రామ శివారులోని శమీ చెట్టుకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. చెన్నకేశవ స్వామి దేవాలయం నుంచి ఉత్సవమూర్తులను శమీ చెట్టు వరకు ఊరేగించారు. శనివారం అమ్మవారిని విజయలక్ష్మిగా అలంకరించారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామి, చౌడమ్మ దేవి, రామాలయం, వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి, గణపతి, సాయిబాబా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. అలాగే వేల్పనూరు గ్రామంలో అంకాల పరమేశ్వరి ఆలయంలో తులాభారం, గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పట్టణంలో అమ్మవారి లడ్డూను వేలంలో రూ.30 వేలకు వాసవీ రైస్ మిల్లు యజమాని సత్యనారాయణ దక్కించుకున్నారు.

నందికొట్కూరు: దసరా ఉత్సవాలు ముగిశాయి. ఆసర పర్వదినం శనివారం అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జమ్మి చెట్టు వద్దకు భారీగా భక్తులు చేరుకోవడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. దుర్గామాతగ దర్శనమిచ్చిన అమ్మవారిని శమీ దర్శనం వరకూ ఊరేగింపుగా తీసుకొచ్చారు. కన్యకా పరమేశ్వరి దేవాలయం నుంచి జమ్మి చెట్టు వరకు అమ్మవారి రథం ఊరేగింపు డప్పువాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. అనంతరం తిరిగి దేవాలయం వరకు అమ్మవారిని ఊరేగింపు సాగింది. జమ్మి చెట్టు వద్ద జరిగిన రావణాసురుడి బొమ్మకు ఎంపీ శబరి బాణం వదిలారు. అలాగే మండల పరిధిలోని స్వగ్రామైన అల్లూరులో జరిగిన జమ్మి వేడుకల్లో ఎమ్మెల్యే జయసూర్య పాల్గొన్నారు.

పగిడ్యాల: మండల కేంద్రం పగిడ్యాతోపాటు గ్రామాల్లో దసరా ఉత్సవాలు ముగిశాయి. దసరా పర్వదినం శనివారం అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో దేవతా ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగిస్తూ గ్రామపెద్దలు శమీ వృక్షాన్ని సందర్శించి పూజలు జరిపించారు. పాత ముచ్చుమర్రిలో జరిగిన దసరా వేడుకల్లో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పాల్గొని దుర్గామాతను భక్తితో పూజించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శమీ వృక్ష ఆకులు(పత్తెర) పెద్దలకు ఇచ్చి నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు.

జూపాడుబంగ్లా: మండంలో విజయదశమి వేడుకలు శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రం జూపాడుతోపాటు గ్రామాల్లో శమీ పూజలు నిర్వహించి విజయాలు చేకూర్చాలని మొక్కుకున్నారు. స్వామివారి పల్లకీని గ్రామాల్లోని పురవీధుల్లో భాజీభజంత్రీలతో ఊరేగించారు. అమ్మవారి విగ్రహాలను మేళతాళాలతో గ్రామపురవీధుల్లో ఊరేగించి సమీపంలోని కేసీ కెనాల్‌లో నిమజ్జనం చేశారు.

మిడుతూరు: మండల కేంద్రం మిడుతూరుతో పాటు గ్రామాల్లో శనివారం విజయ దశమి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా సాగాయి. స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయం, శ్రీ చౌడేశ్వరీ దేవి ఆలయాలలో అమ్మవార్లకు ఉదయం అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, విష్ణు సహస్రపారాయణం తదితర విశేష పూజలను వేదపండితులు సుబ్రమణ్యం శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరీ ఆలయం, గ్రామ వనదేవతలు (గజ్జల పాపమ్మ, వసుదేవమ్మ, రాములమ్మ, లక్ష్మమ్మలు) ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు నైవేద్యం, కాయ, కర్పూరం సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

● **భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం**

స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను మేళతాళలతో శమీ వృక్షం చేరుకున్నారు. వేదపండితులు సుబ్రమణ్యం శర్మ, అర్చకులు వెంకట్రామయ్య జమ్మిచెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాతా రమేష్ రెడ్డి, భూమా క్రిష్ణ మోహన్, నారాయణ, కటకం వెంకటేశ్వర్లు, కటకం రోషయ్య, గుంతా సూర్యనారాయణ శెట్టి, యరభం ప్రమోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలం ప్రజలు దసరా వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లకు భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మేళ తాళాలతో అమ్మవారిని పల్లకిలో ఊరేగిస్తూ శమీ వృక్షం చేరుకున్నారు. పురోహితులు అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజలు శమీ పత్రాలతో దేవాలయాల్లో స్వామి వారి వద్ద ఉంచి పూజలు చేశారు.

కొత్తపల్లి: మండలంలో శనివారం దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొలనుభారతిదేవి ఆలయంలో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తాండవ మల్లేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు జరిగాయి. ముందుగా విఘ్నేశ్వర స్వామికి బిందెఅభిషేకం, కుంకుమార్చన, స్వామివార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్వతిదేవికి ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం తాండవ మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహించారు.


పగిద్యాలలో శమీ వృక్షం దగ్గర ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


దుర్గామాత పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి


తాండవ మల్లేశ్వరస్వామి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

వెలుగోడు: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఈనెల 15, 16వ తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ పవన్‌కుమార్ తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకుని తమ పంటలను కాపాడుకోవాలని సూచించారు.

వరి: వర్షం ఎక్కువైతే పొలాల్లో నీరు నిలువ ఉండకుండా బయటకు పంపాలి. పంటకు వేసే పైపాటి ఎరువులను వర్షాలు తగ్గిన తర్వాతనే వేసుకోవాలి.

వేరుశనగ: కోతలు పూర్తయిన వారు వేరుశనగ కాయలు తడవకుండా టార్పాలిన్‌తో కప్పి ఉంచాలి. కోతకు సిద్ధంగా ఉంటే వర్షాలు తగ్గిన తర్వాత కోతలు చేసుకోవాలి.

పత్తి: పత్తి తీతలు చివరి దశలో ఉన్నందున చివరి తీతను వాయిదా వేసుకుని వర్షాలు తగ్గిన తర్వాత వేసుకోవాలి. ఇది వరకే పత్తి తీత చేసుకున్న వారు పత్తి వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.


పైరును పరిశీలిస్తున్న ఏఓ పవన్ కుమార్

పప్పుశనగ: వర్షాలు తగ్గిన తర్వాత పప్పు శనగ విత్తుకోవడం మంచిది. పప్పు శనగ విత్తనం వేసుకునేందుకు అక్టోబర్ 15వ తేదీ తర్వాత అనకూలంగా ఉంటుంది.

కంది: ప్రస్తుతం మొగ్గ నుంచి పూత దశలో ఉంటుంది కాబట్టి వర్షాలు ఎక్కువైతే పొలం గట్ల నుంచి నీటిని బయటకు విడుదల చేయాలి. ఇలా చేయకపోతే కంది పైరుకు వేరుకుళ్లు, ఎండు తెగులు ఆశించవచ్చు.

భారీ వర్షాలు కురిసే అవకాశం

బండిఆత్మకూరు: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో 14, 15, 16 తేదీల్లో విస్తారంగా వర్షాలుంటాయని వాతావరణశాఖ హెచ్చరించిందని ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మహానందిలో సండే సందడి

మహానంది: మహానందిలో ఆదివారం సండే సందడి నెలకొంది. పెళ్లి ముహూర్తాలు సైతం ప్రారంభం కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు. ముందుగా కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీకామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. నూతన వధూవరులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పురాతన బావి... అద్భుతం!


కొత్తసిద్ధేశ్వరం సమీపాన 155ఏళ్ల క్రితం నిర్మించిన బావి

జూపాడుబంగ్లా: పురాతన నిర్మాణాలు అద్భుతం అనేందుకు మరోసాక్ష్యం పారుమంచాల మజరా గ్రామమైన కొత్తసిద్ధేశ్వరం శివారులోని బావి. దాదాపు 155ఏళ్లనాటి పురాతన బావి నిర్మాణం తీరు చూపరులను ఆకట్టుకుంటుంది. కొత్తసిద్ధేశ్వరం గ్రామస్తుల సమాచారం మేరకు...1980కి పూర్వం గ్రామం ఏర్పడటానికి ముందే బాటసారుల దాహార్తిని తీర్చడానికి ఈ బావిని తవ్వినట్లు సమాచారం. బావి చుట్టూ ఎర్రరాతితో కట్టిన మెట్లు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. ఎండాకాలంలో కూడా బావిపూర్తిగా ఇంకిపోదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. బావిలో పూడికను తొలగిస్తే నీటిమట్టం పెరిగి వేసవిలో గ్రామస్తులు దాహార్తిని తీర్చుకోవటానికి ఎంతో దోహదపడ్తుందంటున్నారు. పురావస్తుశాఖ(అర్కియాలజిస్టు) అధికారులు బావిని పరిశీలించి కట్టడాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు కోరుతున్నారు.

నీలి నింగిలో తెల్లటి మేఘమాలలు!


మహానందిపై మేఘాల పందిరిలా


పుడమిపై పచ్చగా, నింగిపై నీలరంగు, తెల్లటి మేఘందాలు

పుడమి తల్లికి పచ్చటి చీర కట్టినట్లు కనుచూపు మేర కంటికి కనిపించే పంటల పచ్చందాలు. పైన చూస్తే చిత్రకారుడు రంగులద్దినట్లు నీలాకాశం, ఆకాశంలో తెల్లటి దూదితో నేసినట్లున్న శ్వేతవర్ణపు గిరుల్లాంటి మేఘాలు కనువిందు చేశాయి. మహానందానికి నిలయమైన మహానంది ఆలయం మీద మేఘాల పందిరి వేసినట్లు కనిపించిన దృశ్యాలు అబ్బురపరిచాయి. మోదువారిన వృక్షానికి మేమున్నామంటూ మేఘాల ముద్దలు మోదుకు ఓ అందాన్ని తెచ్చాయి. తిమ్మాపురం, అబ్బీపురం, మహానంది పరిసరాల్లో ఈ దృశ్యాలన్ని ఆదివారం కనిపించగా సాక్షి కెమెరాలో బంధించింది.

–మహానంది


మోడు వృక్షంపై ముద్దబంతుల్లా మేఘాలు